డిగ్రీ కళాశాల ఆధునికీకరణ

- రూసా నిధులు రూ.2 కోట్లతో పనులు
- గతంలోనే నిధుల కేటాయింపు
- తరగతి గదులకు మరమ్మతులు



డిగ్రీ కళాశాల తరగతి గదులపై ఉన్న పెంకులను తొలగిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి (సీఎస్‌టీఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రూసా 2.0 (రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్) నిధులతో పనులు చేపట్టారు. కళాశాల అభివృద్ధి నిమిత్తం గతంలోనే కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.2 కోట్లు రూసా 2.0 నిధులు మంజూరు చేసింది. అప్పట్లో కళాశాలకు రూ.50 లక్షల విలువైన కంప్యూటర్లు వచ్చాయి. వీటికి సంబంధించి రూ.10 లక్షలు ఎక్విప్‌మెంట్ రావాల్సుంది. మిగిలిన నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1974లో ఏర్పాటు చేశారు. విద్యా దాత దివంగత మూర్తి రాజు దాతృత్వంలో ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో తొలిసారిగా డిగ్రీ కళాశాల జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏర్పాటైంది. అప్పట్లో ఇక్కడ కళాశాల నిర్వహణకు బంగాళా పెంకులతో తరగతి గదులను నిర్మించారు. ప్రస్తుతం ఈ గదులకు మరమ్మతులు చేపట్టారు. రూసా నిధులు రూ.40 లక్షలు వెచ్చించి బంగాళా పెంకులు తొలగించి, వాటి స్థానంలో డోరియా రేకులతో పైకప్పు ఏర్పాటు చేయనున్నారు. ఫ్లోర్ టైల్స్ ఏర్పాటు, విద్యుదీకరణ చేపట్టనున్నారు. కళాశాల సెమినార్ హాల్ విస్తరణ, బాలుర టాయిలెట్స్, ఇతర మరమ్మతులు చేయనున్నారు. కాగా బాలికలకు ఇప్పటికే టాయిలెట్స్ నిర్మించారు.

రూ.కోటితో కొత్త భవనం

ప్రస్తుతం ఉన్న తరగతి గదులు విద్యావసరాలు సరిపోకపోవడంతో కొత్త భవనం నిర్మాణానికి నిర్ణయించారు. రూసా నిధులు రూ.1 కోటితో కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదించారు. 3 గదులు చొప్పున రెండు అంతస్తుల్లో 6 గదులతో భవనం నిర్మించనున్నారు. ఈ భవన నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులను ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఇంజినీర్ల పర్యవేక్షణలో పూర్తి చేయనున్నారు. కళాశాలలో కోర్సులు బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు ఉన్నాయి. బీఏలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ గ్రూపులు, బీఎస్సీలో బోటనీ, కంప్యూటర్ సైన్స్, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్లు ఉన్నాయి.

అవసరాల రీత్యా ఆధునికీకరణ



కళాశాల అవసరాల రీత్యా ఆధునికీకరణ పనులు చేపట్టాం. రూసా నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు చేపట్టాం. ప్రస్తుత భవనాల బంగాళా పెంకుల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

– ఎస్ ప్రసాద్‌బాబు, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

టి.నరసాపురం: సమయం ఎంతో విలువైందని, దానిని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఎంపీడీఓ ఎస్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. టి.నరసాపురం జెడ్పీ హైస్కూల్ ప్లస్‌ను బుధవారం ఆయన సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు అందించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.రామూర్తి, హెచ్ఎం బి.లింగస్వామి, ఉపాధ్యాయులు కేవీ నారాయణ, ఆర్‌వీజీ కృష్ణారావు, కె.కుటుంబరావు, జె.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గంగానమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 12 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని డీకేడీ సత్యనారాయణ, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, పాలపర్తి శ్రీనివాసరావు, మహంకాళి రాంబాబు తదితరులు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



గాయపడిన వ్యక్తికి సాయం అందిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమండ్రి వైద్యశాలలో చికిత్స పొందుతోన్న ఇద్దరు వ్యక్తులకు మానవత సంస్థ అధ్యక్షుడు పూనెం పోసిబాబు ఆర్థిక సాయం అందించారు. పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన కోడి సాయి చక్రధర్, కోడి తాతారావులు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. వారికి ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున నగదు అందజేశారు. సంస్థ సభ్యులు, రీజనల్ చైర్మన్ చంద్రయ్య, ఆకుల నరసింహమూర్తి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సిద్ద కృష్ణమూర్తి, కోటంరాజు రాంబాబు, పట్టిసం సర్పంచ్ సబ్బారపు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సామగ్రి అందజేత



కార్మికులకు పారిశుద్ధ్య సామగ్రి అందిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు పారిశుద్ధ్య సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ పట్టణం శుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చేసే సేవ ఎనలేనిదన్నారు. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం మరింత మెరుగునకు అవసరమైన దంతులు, డ్రెయిన్ పారలు, చేతి పారలు, కత్తులు, కొడవళ్లు, గుణపాలు, మాస్కులు, గ్లౌజులు కార్మికులకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్ల కేటాయింపుకు సంబంధించి ఏలూరు జీజీహెచ్‌లో సౌకర్యాలను పరిశీలించేందుకు ఈ బృందం బుధవారం ఏలూరులో పర్యటించింది. గుంటూరు మెడికల్ కళాశాల జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, విజయవాడ మెడికల్ కళాశాల గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్యతో కూడిన ప్రత్యేక బృందం ఏలూరు జీజీహెచ్‌లో ఆయా విభాగాలను పరిశీలించింది. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఎనస్థీషియా, పీడియాట్రిక్, ఆర్థో, సర్జికల్ విభాగంలో ఒక్కో పీజీ సీటు కేటాయించేందుకు ఈ పరిశీలన చేస్తున్నట్టు వారు తెలిపారు.

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలపై అవగాహన

చింతలపూడి: ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీలా బేగం అన్నారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ల అవగాహనా కార్యక్రమం బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన కోసం స్వీప్ అనే కార్యక్రమాన్ని రూపొందించిందని, క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం, ఓటర్లలో అక్షరాశ్యత పెంపొందించడం స్వీప్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 జి.రామారావు, ఎంఈఓ–2 కిరణ్ బాబు, ప్రిన్సిపాల్ స్కైలాబ్ పాల్గొన్నారు.

ఆటో పార్కింగ్ స్థలం కేటాయించాలి

కుక్కునూరు: ఆటో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. కుక్కునూరు మండల కేంద్రంలో ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం, పికపింగ్, డ్రాపింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సుబాన్, వేల్పుల దుర్గయ్య, శనగ రాము, పెంకే మహేష్, అశోక్, గోపి, రంజిత్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు శంకుస్థాపన

లింగపాలెం: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ మండలంలోని అయ్యప్పరాజుగూడెం, కలరాయనగూడెం, బోగోలు, ములగలంపాడు, రంగాపురం తదితర గ్రామాల్లో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బుట్టాయగూడెం: మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పలు సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు కరాటం రాంబాబు, కరాటం సాయిబాబా, పాదం నాగకృష్ణ, జి.రవి కుమార్, వెట్టి బుచ్చిరాజు, ఎంపీడీఓ కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భూ రీసర్వేపై గ్రామ సభలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలంలో భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ నుంచి నవంబర్ 7 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.స్లీవజోజి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలు, విస్తీర్ణం సమస్యలు, జాయింట్ ఎల్‌పీఎంలు, రైతుల ఖాతాల మార్పు, మ్యూటేషన్‌లు, పాత సర్వే నెంబర్ల మార్పులపై వచ్చే అభ్యంతరాలపై అర్జీలు స్వీకరిస్తారని, వీటిని 15 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపడతారని పేర్కొన్నారు. తహసీల్దార్, రెవెన్యూ డీటీ, ఎంఐఎస్ఓ, ఆర్ఐ, వీఆర్ఓ, విలేజ్ సర్వేయర్ల బృందం గ్రామాల్లో పర్యటిస్తుందని తెలిపారు. ఈ నెల 18న పట్టెన్న పాలెం, 19న అక్కంపేట, 22న శ్రీనివాసపురం, 23న పుల్లేపూడి, 24న మైసన్నగూడెం, 25న పెద్దిపల్లి, 26న చక్రదేవరపల్లి, 29న రామచర్లగూడెం, 30న తిరుమలాపురం, నవంబర్ 1న పంగిడిగూడెం, 2న లక్కవరం, 5న దేవులపల్లి, 6న అమ్మపాలెం, 7 నిమ్మలగూడెం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ స్లీవజోజి పేర్కొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన



సీతంపేటలో వరిని పరిశీలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: వరిలో సాగు పద్ధతులపై రైతులకు కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు అవగాహన కల్పించారు. సీతంపేట, యర్రంపేట పంచాయతీల పరిధి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ శాఖలో అమలవుతోన్న పీఎం కిసాన్, గ్రీన్ మనూరి విత్తనాల గురించి వివరించారు. వరిలో ఎక్కువగా ఉన్న కంకినల్లి నివారణకు డైకోఫాల్ అనే మందు 5 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ అధికారి చెన్నకేశవులు, ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్, వెటర్నరీ డాక్టర్ బీఆర్ శ్రీనివాస్ మాట్లాడారు.

జిల్లెళ్లగూడెం గ్రామంలో..

పోలవరం రూరల్: పోలవరం మండలం జిల్లెళ్లగూడెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులు రైతులతో సమావేశమై క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకున్నారు. ఎరువులు వాడకం తగ్గించి భూసారాన్ని పరిరక్షించడం, సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ వ్యవసాయాన్ని వాడుకలోకి తీసుకురావడం వంటి వాటిపై ఏఓ కె.రాంబాబు అవగాహన కల్పించారు. పెట్టుబడి ఆదా, భూగర్భజలాల సంరక్షణ తదితర విషయాలను వివరించారు. పంటల మార్పిడి సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన

టి.నరసాపురం: మండలంలోని వెలగపాడు, అల్లంచర్ల రాజుపాలెం పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రైతులకు వ్యవసాయశాఖలో ఉన్న పథకాలను మండల వ్యసాయాధికారి బి.సుమలత వివరించారు. ఈ పంట నమోదు వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో శీలం వెంకటేశ్వరావు, సర్పంచ్ నార్ని వెంకట్రావు పాల్గొన్నరు.

గిరిజన మహిళకు న్యాయం చేయాలి



రెడ్డిగూడెం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వెంకటరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని జేఏసీ నాయకులు మొడియం శ్రీనివాస్, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందుగుల ఫ్రాన్సిస్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రెడ్డిగూడెంలో మృతుడు వెంకటరెడ్డి భార్య, కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో లక్ష్మీపురం సమీపంలో ఎం సోంబాబు అనే వ్యక్తి కారు ప్రమాదంలో వెంకటరెడ్డి మృతిచెందాడని, దీనికి కారణమైన సోంబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటరెడ్డి భార్య అమ్మాజీకి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం చింతారావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



వాహనచోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై కుటుంబరావు హెచ్చరించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాద మరణాలకు హెల్మెట్ లేకుండ ప్రయాణించడమే ప్రధాన కారణమని ఎస్సై వివరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం ద్వారా తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాహనచోదకులు తమ వద్ద వాహన లైసెన్స్, సీబుక్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు వెంట పెట్టుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత పాటించని వాహన దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఆహార దినోత్సవం



చిన్నబుర్రతోగులో నిర్వహిస్తున్న ఆహార దినోత్సవ కార్యక్రమం

వేలేరుపాడు: మండలంలోని చిన్నబుర్రతోగు గ్రామంలో ఆదివాసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆహార దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ మహిళలు మాట్లాడుతూ మన భూమి – మన తాడి, మన ఆరోగ్యం – మన సంతోషం కార్యక్రమాలను అక్టోబర్ 5 నుంచి 16 వరకు నిర్వహించామని తెలిపారు. చివరి రోజు ఆహారం న్యాయం, ఆహారం సార్వభౌమాధికారం సాధించే దిశగా అవగాహన ప్రచార కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సంఘం కార్యకర్తలు మడకం సునీత, కాక రజిని, సవలం కనక, కారం శారద, ఎం రాంబాబు, ఉయికే ముత్యాలరావు, మడకం సుబ్బారావు, కారం నర్సయ్య, మిరియాల వెంకటేశ్వర్లు, రాంబాబు, శ్రీను, గాంధీ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలి



సదస్సు పోస్టర్ విడుదల చేసిన కార్మికులు

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏపీ ప్రగతి శీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి నవుడు నెహ్రూబాబు కోరారు. ఈనెల 18న విజయవాడలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తంగెళ్లమూడి ఏరియా ఐఎఫ్‌టీయూ స్థూపం వద్ద వాల్ పోస్టర్ విడుదల చేశారు. నెహ్రూబాబు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్షా 34 వేల మంది భవన నిర్మాణ కార్మికులు కార్మిక శాఖలో నమోదై ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు కాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని తెలిపారు. కుటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

రూ.1.25 లక్షలు పలికిన డ్రైఫ్రూట్ లడ్డూ



110 కేజీల లడ్డూను అంజనరావుకు అందిస్తున్న దృశ్యం



90 కేజీల లడ్డూను సాయి నగేష్‌కు అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గంగానమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలు భారీ ధర పలికాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో లడ్డూల వేలం నిర్వహించారు. గంగానమ్మవారికి లలిత సూర్య స్వీట్స్ యజమాని ఆకుల రామచంద్రరావు దంపతులు సమర్పించిన 110 కేజీల డ్రైఫ్రూట్ లడ్డూను నడిపల్లి అంజనరావు రూ.1.25 లక్షలకు దక్కించుకున్నారు. భక్తాంజనేయ స్వీట్స్ యజమాని గుబ్బల రాంబాబు దంపతులు గంగానమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన 90 కేజీల డ్రైఫ్రూట్ లడ్డూను వాసవీ సాయి నగేష్ రూ.55 వేలకు దక్కించుకున్నారు. వీరిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కలగర వీర్రాజు, చోడే ఫణిచంద్రశేఖర్, కందులపాటి సురేష్ బాబు, చింత నాగరాజు, పసుమర్తి వెంకట సత్యనారాయణ, సత్యవరపు బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు.. రహదారులకు తూట్లు



భీమడోలు జంక్షన్ రోడ్డుపై వర్షపు నీరు



ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం రోడ్డు దుస్థితి

భీమడోలు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయపడిపోతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. భారీ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చకపోవడంతో కూటమి ప్రభుత్వం పాలనను ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. నీటితో నిండిన గోతు ల్లో పడి ద్విచక్ర వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు, రాజుల వీధి, ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం, సూరప్పగూడెం నుంచి పాతూరు రోడ్డు, భీమడోలు నుంచి పెదలింగంపాడు, కొల్లేరు గ్రామాల్లోని రోడ్లు అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్అండ్‌బీ శాఖకు నిధులు మంజూరైనా భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు గోతులను పూడ్చిన పాపాన పోలేదు. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయ డంతో వాహనదారులు, ప్రయాణికులు, భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఎంఎంపురం నుంచి సాయన్నపాలెం వరకు ఆరు కిలోమీటర్ల ప్రయాణం నరక ప్రాయంగా మారింది. ఆ రోడ్డులో వర్షం కురిస్తే మోటార్ బైక్‌లు, సైకిళ్ల అదుపు తప్పి పక్కనే పంట బోదె, పొలాల్లో వెళ్లాల్సిందే. ఈ రోడ్డుపై ప్రయాణం నరకానికి ఆనవాళ్లుగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు గోతులను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎయిమ్ సైనికుడి వైద్యానికి సాయం

టి.నరసాపురం: కాన్సర్‌తో బాధపడుతోన్న టి.నరసాపురం గ్రామానికి చెందిన దూబా విల్సన్ వైద్యానికి ఎయిమ్ అధ్యక్షుడు పీవీ సునీల్ కుమార్ సాయం అందించారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి అపాయింట్‌మెంట్ తీసుకుని విల్సన్‌ను అడ్మిట్ చేయించడంతో పాటు, అతని వైద్యానికి అయ్యే మొత్తం ఖర్చు ఆయనే భరిస్తున్నారని ఎయిమ్స్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ తెలిపారు. సునీల్ కుమార్‌కు ఎయిమ్ జిల్లా, మండల నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీపై ఉచిత శిక్షణ

కొయ్యలగూడెం: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీపై శిక్షణ ఇస్తున్నట్టు ఏఎస్‌డబ్ల్యూఓ ముప్పిడి రాజు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ టెట్ అర్హత గల వార్షిక ఆదాయం 2.50 లక్షల్లోపు అభ్యర్థులు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అక్టోబర్ 21 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 99893 26860కు సంప్రదించాలని సూచించారు.

నేడు పూర్ణాహుతి

కొయ్యలగూడెం: స్థానిక రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గాయత్రీమాత లక్ష కుంకుమార్చన పీఠంలో గురువారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు అర్చకుడు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. అనంతరం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. గ్రామ సుభిక్షం కోసం ఐదేళ్ల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికి మూడేళ్లు పూర్తయ్యాయని పాలకమండలి చైర్మన్ మద్దు గోపి తెలిపారు.